रजिस्ट्री सं. डी–२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య. డి–221

मूल्य रू. १९.००
Price Rs. 19.00
మూల్యము : రూ. 19.00

# भारत का राजपत्र
# The Gazette of India
## భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ
भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1
प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १. | नई दिल्ली | सोमवार | १८ फिब्रवरि, २०१९/११ | छौत्र | खंण्ड २६ |
| No.1 | New Delhi | Monday | 18 February, 2019/11 | Chaitra | Vol. 26 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | సోమవారము | 18 ఫిబ్రవరి, 2019/11 | చైత్ర | సంపుటము 26 |

MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 6th February, 2019/Paush, 1940 Vilambi.

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Preconception and Pre-natal Diagnostic Techniques (Prohibition of Sex Selection) Act, 1994 [Act No.57 of 1994], (2) The Special Economic Zones Act, 2005 [Act No.28 of 2005] are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) గర్భధారణకు ముందు మరియు ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియల (లింగనిర్ధారణను నిషేధించు) చట్టము, 1994 (1994లోని 57వ చట్టము), (2) ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టము, 2005 (2005 లోని 28వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# గర్భధారణకు ముందు మరియు ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియల (లింగనిర్ధారణను నిషేధించు) చట్టము, 1994.[1]

(1994లోని 57వ చట్టము)

[20, సెప్టెంబరు, 1994]

[2][గర్భధారణకు ముందు లేదా తరువాత జన్యుపరమైన అసాధారణత్వములు లేదా జీవకణ అస్తవ్యస్తతలు లేదా క్రోమోజోముల అసాధారణత్వములు లేదా పుట్టుకతో వచ్చు కొన్ని వికృత రూపములు లేదా లింగ సంబంధ అస్తవ్యస్తతలను కనుగొను ప్రయోజనము కొరకైన ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను క్రమబద్ధము చేయుటకు మరియు లింగ నిర్ధారణ ద్వారా స్త్రీ భ్రూణ హత్యకు దారితీయు లింగనిర్ధారణ కొరకు వాటిని దురుపయోగపరచుటను నిషేధించుటకు మరియు అందుకు సంబంధించిన లేక వాటి ఆనుషంగికమైన విషయములను నిబంధించుటకైన చట్టము.]

భారత గణరాజ్యపు నలభై ఐదవ సంవత్సరములో పార్లమెంటు ఈ క్రింది విధముగా శాసనము చేసినది:-

## అధ్యాయము - 1

## ప్రారంభిక

సంగ్రహ నామము, విస్తరణ మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును గర్భధారణ పూర్వ మరియు [3][ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియల (లింగ నిర్ధారణను నిషేధించు)] చట్టము, 1994 అని పేర్కొనవచ్చును.

(2) ఇది, జమ్మూ, కాశ్మీరు రాజ్యము మినహా యావత్ భారతదేశమునకు విస్తరించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీ* అమలులోనికి వచ్చును.

నిర్వచనములు.

2. ఈ చట్టములో, సందర్భము ఇతర విధముగా కోరిననే తప్ప,-

---

1. 20-9-1994వ తేదీ నాటి భారత ప్రభుత్వ రాజపత్రము, అసాధారణ, పార్టు-2 యొక్క 1వ పరిచ్ఛేదముగా ప్రచురించబడినది.
2. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2005 నుండి ఉంచబడినది.
3. ''ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలు (క్రమబద్ధము చేయు మరియు దురుపయోగమును నిషేధించు)'' అనుపదములు మరియు బ్రాకెట్లు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినవి.

*1-1-1996, అధిసూచన నెంబరు ఎస్.ఓ.990 (ఈ), తేదీ:21-12-1005 ద్వారా

(ఎ) "సముచిత ప్రాధికార సంస్థ" అనగా 17వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన సముచిత ప్రాధికార సంస్థ అని అర్థము;

(బి) "బోర్డు" అనగా 7వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటుచేయబడిన కేంద్ర పర్యవేక్షణ బోర్డు అని అర్థము;

[1][(బిఎ) "గర్భధారణ" అనగా పిండము లేదా భ్రూణము మరియు అదనపు పొరలలోని పిండోత్పత్తితోసహా గర్భములో ఫలదీకరణ నుండి జననము వరకు ఏ స్థితిలోనైనను అభివృద్ధిచెందు ఏదేని ఉత్పాదితము అని అర్థము;

(బిబి) "పిండం (ఎంబ్రియో)" అనగా ఫలదీకరణ తరువాత ఎనిమిది వారముల చివరి వరకు (యాభై ఆరురోజులు) పెరుగుతున్న మానవ జీవి అని అర్థము;

(బిసి) "భ్రూణము (ఫోటస్)" అనగా ఫలదీకరణ లేదా సృష్టి ప్రారంభం మొదలైన యాభై ఏడవ రోజు నుండి (దాని పెరుగుదల ఆగిపోయిన ఏదేని కాలమును మినహాయించి) జననము పూర్తిఅగునంత వరకు గల కాలములో పెరుగుతున్న మానవ జీవి అని అర్థము;]

(సి) "జన్యుపరమైన సలహా కేంద్రం" అనగా ఏ పేరుతో పిలువబడినప్పటికినీ రోగులకు జన్యుపరమైన సలహాను సమకూర్చే సంస్థ, ఆసుపత్రి, నర్సింగుహోం లేదా ఏదేని స్థలము అని అర్థము;

(డి) "జన్యు సంబంధ వైద్యశాల (క్లినిక్)" అనగా ఏపేరుతో పిలువబడినప్పటికినీ జననమునకు పూర్వము రోగ నిర్ధారణ ప్రక్రియలను నిర్వహించేందుకైన వైద్యశాల (క్లినిక్), ఆసుపత్రి, నర్సింగు హోము లేదా ఏదేని స్థలము (చోటు) అని అర్థము;

[2][విశదీకరణ:- ఈ ఖండం ప్రయోజనము నిమిత్తము, "జన్యుసంబంధ వైద్యశాల (జెనెటిక్ క్లినిక్)" అనుపదములో గర్భధారణకు ముందు లింగ నిర్ధారణ చేయుటకైనటు వంటి లేదా గర్భముతోనున్న సమయంలో భ్రూణము యొక్క లింగ నిర్ధారణను తెలుసుకొనుటకైనటు వంటి, సులువుగా తరలించగలిగినట్టి సాధనములను కలిగినట్టి వాహనము మరియు ఇందులో అల్ట్రా సౌండ్ యంత్రము లేదా ప్రతిబింబ యంత్రము లేదా శోధకము లేదా ఇతర విధంగా సామర్థ్యంగల పరికరములు చేరియుండును.]

---

1. (బిఎ), (బిబి), (బిసి) ఖండములు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.
2. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి విశదీకరణ చేర్చబడినది.

(ఇ) "జన్యు సంబంధ ప్రయోగశాల" అనగా ఒక ప్రయోగశాల మరియు ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు జన్యు వైద్యశాల (జెనెటిక్ క్లినిక్) నుండి స్వీకరించిన నమూనాల (శాంపిల్సు) విశ్లేషణ లేదా పరీక్ష కొరకు సమకూర్చబడు సౌకర్యములు గల స్థలము అని అర్థము;

[1][విశదీకరణ:- ఈ ఖండము నిమిత్తము "జన్యుసంబంధ ప్రయోగశాల" అను పదములో గర్భధారణకు ముందు లింగ నిర్ధారణ చేయుటకైనటువంటి లేదా గర్భముతో నున్న సమయంలో భ్రూణము యొక్క లింగ నిర్ధారణను తెలుసుకొనుటకై ఉపయోగించు అల్ట్రాసౌండ్ యంత్రము లేదా ప్రతిబింబ యంత్రము లేదా శోధకము వంటి సులువుగా తీసుకొని పోగల (పోర్టబుల్) పరికరమును లేదా అటువంటి సామర్థ్యముగల ఇతర పరికరములను కలిగి ఉన్న స్థలము అని అర్థము.]

(ఎఫ్) "స్త్రీ జననేంద్రియ చికిత్స వైద్యుడు (గైనకాలజిస్టు)" అనగా స్త్రీ జననేంద్రియ శాస్త్రములో మరియు ప్రసవ సంబంధమైన విషయములలో పోస్టు గ్రాడ్యుయేటు అర్హత కలిగి ఉన్నట్టి వ్యక్తి అని అర్థము;

[2][(జి) "జన్యు సంబంధ చికిత్స వైద్యుడు (మెడికల్ జెనెటిస్టు)" అనుపదములో లింగ నిర్ధారణ మరియు ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియల రంగంలోని జన్యుశాస్త్రములో డిగ్రీ లేదా డిప్లొమాను కలిగి ఉండిన, లేదా ఈ క్రింది వాటిలోని ఏవేని రంగాలలో,-

(i) భారతీయ వైద్యమండలి చట్టము, 1956 (1956లోని 102వది) క్రింద గుర్తించబడిన వైద్య అర్హతలలో ఏదేని ఒక అర్హత; లేదా

(ii) జీవసంబంధ విజ్ఞాన శాస్త్రములలో పోస్టు గ్రాడ్యుయేటు డిగ్రీ కలిగియుండి రెండు సంవత్సరములకు తక్కువకానట్టి అనుభవము కలిగినట్టి ఎవరేని వ్యక్తి చేరిఉండును.]

(హెచ్) "శిశు చికిత్స వైద్యుడు" (పిడియాట్రీషియన్) అనగా శిశు చికిత్సలో పోస్టుగ్రాడ్యుయేటు అర్హతకలిగి ఉన్న వ్యక్తి అని అర్థము;

---

1. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి విశదీకరణ చేర్చబడినది.
2. ఖండము (జి) మరియు (ఐ)లు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.

[1][(ఐ) "ప్రసవపూర్వ రోగనిర్ధారణ ప్రక్రియలు" అనగా గర్భధారణకు ముందు లేదా ఆ తరువాత ప్రసవపూర్వ రోగ నిర్ధారణ ప్రక్రియలకైన ఏదేని విశ్లేషణ చేయుటకై పురుషుని ద్రవము లేదా మహిళ యొక్క ఉమ్మ నీటి ద్రవము (అమ్నియోటిక్ ఫ్లూయిడ్), కోరియోనిక్ విల్లీ, పిండము, రక్తము లేదా ఏదేని ఇతర కణజాలము యొక్క నమూనాలను తీసుకొని లేదా తొలగించి వాటిని జన్యుపర ప్రయోగశాలకు లేదా జన్యుపర క్లినిక్‌కు పంపుట మరియు గర్భధారణకు ముందు లేదా ఆ తరువాత ప్రసవపూర్వ రోగ నిర్ధారణ కొరకు అల్ట్రాసోనోగ్రఫీ, ఫియటోస్కోపీ వంటి స్త్రీ జననేంద్రియ లేదా ప్రసవ సంబంధమైనట్టి లేదా వైద్య ప్రక్రియలు అని అర్థము;]

(జె) "ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలు" అను పదబంధములో ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ ప్రక్రియలు మరియు ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ పరీక్షలు చేరియుండును;

[2][(కె) "ప్రసవ పూర్వ రోగనిర్ధారణ పరీక్ష (ప్రీ నాటల్ డయోగ్నోస్టిక్ టెస్టు)" అనగా గర్భిణీస్త్రీ యొక్క అమ్నియోటిక్ ఫ్లూయిడ్, కొరియోనిక్ విల్లీ, రక్తము లేదా ఏదేని కణజాలం లేదా ద్రవాన్ని ఏదేని పరీక్ష కొరకు లేదా విశ్లేషణ కొరకు లేదా గర్భముతోనున్నపుడు జన్యుపరమైన లేదా జీవకణ అస్తవ్యస్తములు లేదా క్రోమోజోముల అసాధారణత్వములు లేదా పుట్టుకతో వచ్చిన వ్యత్యాసములు లేదా మూత్రంలో రక్తవర్ణం (హిమోగ్లోబినోపతీస్) లేదా లింగ సంబంధ వ్యాధుల విషయములో జరుపు అల్ట్రాసోనోగ్రఫీ లేదా ఏదేని పరీక్ష లేదా విశ్లేషణ ప్రక్రియ అని అర్థము;]

(ఎల్) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(ఎమ్) "రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు" అనగా భారతీయ వైద్య మండలి చట్టము, 1956 (1956లోని 102వది) యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (హెచ్)లో నిర్వచించబడినట్టి ఏదేని గుర్తించబడిన వైద్య అర్హతను కలిగినట్టి మరియు రాష్ట్ర వైద్య రిజిస్టరులో పేరు నమోదై ఉన్నట్టి వైద్య వృత్తిదారు అని అర్థము;

(ఎన్) "వినియమములు" అనగా ఈ చట్టము క్రింద బోర్డుచే రూపొందించబడిన వినియమములు అని అర్థము;

---

1. ఖండము (జి) మరియు (ఐ)లు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.
2. ఖండము (కె) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

[1][(ఒ) "లింగ నిర్ధారణ" అనుపదములో పిండము ఒక ప్రత్యేక లింగమునకు చెందగల అవకాశము లేదా అట్టి సంభావ్యతను మెరుగుపరచగల ప్రయోజనము కొరకైన ఏదేని ప్రక్రియ, సాంకేతిక, పరీక్ష లేదా పరిపాలన లేదా ఔషధపత్రం లేదా నిబంధన చేరియుండును;]

(పి) "ధ్వనిసంబంధ చికిత్స వైద్యుడు (సోనోలజిస్టు) లేక ప్రతిబింబ (ఇమేజింగు) నిపుణుడు" అనగా భారతీయ వైద్యమండలి చట్టము, 1956 (1956లో 102వది) క్రింద గుర్తించబడిన వాటిలో ఏదైనా ఒక వైద్య అర్హతను లేదా అల్ట్రాసోనోగ్రఫీ లేదా ప్రతిబింబ సాంకేతిక ప్రక్రియలు (ఇమేజింగు టెక్నిక్కు) లేదా రేడియోలజీలో పోస్టుగ్రాడ్యుయేటు అర్హతను కలిగిన వ్యక్తి అని అర్థము;

(క్యూ) "రాజ్య బోర్డు" అనగా 16ఏ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన రాజ్య పర్యవేక్షక బోర్డు లేదా సంఘ రాజ్య క్షేత్ర పర్యవేక్షక బోర్డు అని అర్థము;

(ఆర్) శాసనమండలిని కలిగిఉన్న సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి "రాజ్య ప్రభుత్వము" అనగా భారత సంవిధానము యొక్క 239వ అనుచ్ఛేదము క్రింద భారత రాష్ట్రపతిచే నియమించబడిన ఆ సంఘ రాజ్య క్షేత్ర పరిపాలకుడు అని అర్థము.]

## అధ్యాయము - 2

## జన్యు సంబంధ సలహా కేంద్రములు, జన్యుసంబంధ ప్రయోగశాలలు మరియు జన్యుసంబంధ వైద్యశాలల వినియమము

జన్యుసంబంధ సలహా కేంద్రములు, జన్యు సంబంధ ప్రయోగశాలలు మరియు జన్యు సంబంధ వైద్యశాలల వినియమము.

3. ఈ చట్టము ప్రారంభమైన తేదీన మరియు అప్పటి నుండి,-

(1) ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడిననే తప్ప, ఏ జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలయైనను, ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతికతలకు సంబంధించిన కార్యకలాపములను నిర్వహించరాదు లేదా వాటికి సహకరించరాదు లేదా వాటికి సహాయపడరాదు.

[2][(2) ఏ జన్యు సంబంధ సలహా కేంద్రము లేదా జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలయైనను, గౌరవ పూర్వకముగానైనను లేదా చెల్లింపు పద్ధతిపై, విహితపరచబడు విద్యార్హతలు కలిగియుండనట్టి ఎవరేని వ్యక్తిని నియమించరాదు లేదా నియమించబడునట్లు చూడరాదు లేదా అతని సేవలను తీసుకొనరాదు.]

---

1. ఖండములు (ఒ) నుండి (ఆర్) వరకు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.
2. ఉప-పరిచ్ఛేదము (2) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

(3) ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడిన ప్రదేశము కానట్టి ఇతర ప్రదేశములో, ఏ జన్యుసంబంధ చికిత్స వైద్యుడిగా, స్త్రీ జననేంద్రియ చికిత్స వైద్యుడుగా, శిశుచికిత్సా వైద్యుడుగా, రిజిస్టరైన వైద్య వృత్తిదారుడు లేదా ఎవరేని ఇతర వ్యక్తియైనను, ఏవేని ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతికతలను తాను స్వయంగాగాని లేదా ఎవరేని ఇతర వ్యక్తి ద్వారాగాని నిర్వ హించరాదు లేదా నిర్వహించబడునట్లు చూడరాదు లేదా నిర్వహించుటలో సహాయపడరాదు.

లింగనిర్ధారణ నిషేధము.

[1][3-ఏ. వంధ్యత్వ రంగంలోని నిపుణుడు లేదా నిపుణుల బృందముతో సహా ఏ వ్యక్తియు, స్వయముగా లేదా ఇతర వ్యక్తి ద్వారా మహిళ లేదా పురుషుని లేదా ఇద్దరిపై, ఎవరినుండైనా లేదా ఇద్దరి నుండి లింగ నిర్ధారణకై ఏదేని కణజాలం, పిండం, గర్భస్థ ద్రవము లేదా బీజకణమును గ్రహించుట నిర్వహించరాదు లేదా నిర్వహింపచేయరాదు.

చట్టము క్రింద రిజిస్టరు చేయబడని వ్యక్తులు, ప్రయోగశాలలు, వైద్యశాలలకు అల్ట్రాసౌండ్ యంత్రములు మొదలైనవాటి విక్రయముపై నిషేధము.

3-బి. ఏవ్యక్తియు ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడని ఏదేని జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల, జన్యుసంబంధ వైద్యశాల లేదా ఎవరేని ఇతర వ్యక్తికి ఏదేని అల్ట్రాసౌండ్ యంత్రము లేదా ప్రతిబింబ (ఇమేజింగు) యంత్రము లేదా శోధకము లేదా భ్రూణము యొక్క లింగనిర్ధారణ సమర్థతగల ఏదేని ఇతర సాధనమును విక్రయించరాదు.]

## అధ్యాయము - 3

## ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల క్రమబద్ధీకరణ

ప్రసవ పూర్వరోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల క్రమబద్ధీకరణ.

4. ఈ చట్టము ప్రారంభమైన తేదీన మరియు అప్పటి నుండి,-

(1) ఖండము (2)లో నిర్దిష్టపరచబడిన మరియు ఖండము (3)లో నిర్దిష్టపరచిన ఏవేని షరతులను సంతృప్తిపరచిన పిమ్మటనే తప్ప, ప్రసవ పూర్వక రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వర్తించేందుకు, రిజిస్టరు చేయబడినట్టి జన్యు సంబంధ సలహా కేంద్రము లేదా జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలతోసహా ఎవరేని వ్యక్తి ఏ స్థలమును ఉపయోగించబడరాదు లేదా ఉపయోగింపజేయరాదు.

(2) ఈ క్రింది ఏవేని అసాధారణతలను కనుగొనేందుకు తప్ప, ఏ ప్రసవ పూర్వక రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వహించరాదు, అవేవనగా,-

(i) వర్ణగ్రాహక (క్రోమోసోమల్) అసాధారణతలు;

(ii) జన్యు సంబంధ జీవక్రియ వ్యాధులు;

(iii) మూత్రంలో రక్తవర్ణం (హీమోగ్లోబినోపథీస్);

(iv) లింగ జన్యు సంబంధిత వ్యాధులు;

(v) పుట్టుకతో వచ్చిన వ్యత్యాసములు;

---

1. 3-ఏ మరియు 3-బీ పరిచ్ఛేదములు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.

[1][(vi) కేంద్ర పర్యవేక్షక బోర్డుచే నిర్ధారించబడునట్టి ఏదేని ఇతర అసాధారణతలు లేదా వ్యాధులు.

[2][(3) ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించుటకు లేదా నిర్వహించుటకు అర్హత కలిగిన వ్యక్తి, వ్రాతమూలకముగా రికార్డు చేయదగు ఈ క్రింది షరతులపై సంతృప్తి చెందిననే తప్ప, అట్టి సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించరాదు లేదా నిర్వహించరాదు, అవేవనగా,-

(i) గర్భిణీ స్త్రీ వయస్సు ముప్పైఐదు సంవత్సరములకు పైబడి ఉన్నదని;

(ii) గర్భిణీస్త్రీ రెండు లేదా మూడు పర్యాయములు ఆకస్మిక గర్భస్రావములు లేదా భ్రూణ నష్టమునకు గురి అయినదని;

(iii) సంభావ్యముగా అపురూప జననమునకు కారకమగు మాదకద్రవ్యములు, రేడియేషను, అంటువ్యాధి లేదా రసాయనిక పదార్థములు వంటి వాటికి గర్భిణీ స్త్రీ గురి అయినదని;

(iv) గర్భిణీస్త్రీ లేదా ఆమె భర్త కుటుంబ చరిత్రలో బుద్ధిమాంద్యం లేదా శారీరక వైకల్యంవంటి దుస్సంకోచ స్థితి (స్పాస్టిసిటీ) లేదా ఏదేని ఇతర జన్యు సంబంధ వ్యాధిని కలిగి ఉన్నవనే విషయముపై;

(v) బోర్డు ద్వారా నిర్దిష్టపరచబడునట్టి ఏదేని ఇతర షరతు:

అయితే, గర్భిణీ స్త్రీపై అల్ట్రాసోనోగ్రఫీని నిర్వహించే వ్యక్తి, విహితపరచ బడునట్టి రీతిలో దాని గురించి క్లినిక్ లోని రికార్డులో పూర్తిగా వ్రాసి ఉంచవలెను మరియు దానిలో ఏదేని లోపం లేదా తేడా కనిపించినపుడు అట్టి అల్ట్రాసోనోగ్రఫీని నిర్వహించే వ్యక్తి ఇతర విధముగా నిరూపించుకొనిననే తప్ప, అది 5వ లేదా 6వ పరిచ్ఛేదపు నిబంధనల ఉల్లంఘన అగును.

(4) ఖండము (2)లో నిర్దిష్టపరచబడిన ప్రయోజనములకు తప్ప, ఏదేని ప్రసవ పూర్వక రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వహించవలసినదని గర్భిణీ స్త్రీ యొక్క బంధువు లేదా భర్తతో సహా ఏ వ్యక్తియు కోరరాదు లేదా ప్రోత్సహించరాదు.

(5) ఒక మహిళపై లేదా ఆమె భర్తపై లేదా ఇద్దరిపై ఏదేని లింగనిర్ధారణ ఎంపిక సాంకేతిక పరీక్ష నిర్వహించవలసిందని ఆమె బంధువు లేదా భర్తతో పాటు ఏ వ్యక్తియు కోరరాదు లేదా ప్రోత్సహించరాదు.]

---

1. ఖండము (vi) ఎస్.ఓ.189 (ఈ) ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.
దంపతులలో అప్పుడప్పుడు సంభవించే జన్యుసంబంధిత వ్యాధి, గర్భవతిగా ఉన్నప్పుడు గర్భము వెూయు పరిస్థితి కొరకు, పాజిటివ్ స్క్రీనింగ్ పరీక్ష లేదా భ్రూణములో వచ్చేందుకు అవకాశమున్న జన్యు సంబంధ వ్యాధి/పుట్టుకతో వచ్చే వ్యత్యాసాల కొరకు పాజిటివ్ స్క్రీనింగ్ పరీక్ష మొదలైనటు వంటి వాటికైన ఏదేని ఇతర సూచనలు.
2. ఉప-పరిచ్ఛేదము (3), (4), (5)లు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.

గర్భిణీస్త్రీ యొక్క వ్రాతపూర్వక అంగీకారము మరియు భ్రూణము యొక్క లింగ నిర్ధారణను తెలియ జేయుటకై నిషేధము.

5.(1) 3వ పరిచ్ఛేదపు ఖండము (2)లో నిర్దేశించబడిన ఏ వ్యక్తియు ఈక్రింది సందర్భములలో తప్ప, ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వహించరాదు,-

(ఎ) సంబంధిత గర్భిణీ స్త్రీకి, అట్టి ప్రక్రియల మూలముగా మరియు ఆ తరువాత సంభవించగల పరిణామాలన్నింటిని గురించి తనకు తెలిసినదంతయు వివరించవలెను;

(బి) ఆమె అర్థం చేసుకోగల భాషలో, అట్టి ప్రక్రియల నిర్వహణకు లోనగుటకు విహిత ప్రరూపములో ఆమెనుండి అతడు వ్రాతపూర్వక అంగీకారమును పొందవలెను; మరియు

(సి) ఖండము (బి) క్రింద పొందిన ఆమె యొక్క వ్రాతపూర్వక అంగీకారపు ప్రతిని గర్భిణీ స్త్రీకి అందజేయవలెను.

[1][(2) ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ ప్రక్రియలను నిర్వహించు వ్యక్తితో సహా ఏ వ్యక్తియు, మాటలు, సైగలు లేదా ఏదేని ఇతర రీతిలో భ్రూణము యొక్క లింగ నిర్ధారణ ఫలితమును సంబంధిత గర్భిణి స్త్రీకి, లేదా ఆమె బంధువులకు లేదా ఎవరేని ఇతర వ్యక్తికి తెలియజేయరాదు.]

లింగ నిర్ధారణపై నిషేధము.

6. ఈ చట్టము ప్రారంభమైన తేదీన మరియు అప్పటి నుండి,-

(ఎ) జన్యు సంబంధ సలహా కేంద్రము లేదా జన్యు సంబంధ పరిశోధనశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల (క్లినిక్), తన కేంద్రములోను, పరిశోధనశాలలోను లేదా వైద్యశాల (క్లినిక్)లోను, అల్ట్రాసోనోగ్రఫీతో భ్రూణము యొక్క లింగ నిర్ధారణ కొరకు ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వహించరాదు లేదా నిర్వహింపజేయరాదు;

(బి) ఏ వ్యక్తియు భ్రూణము యొక్క లింగ నిర్ధారణ కొరకు అల్ట్రా సోనోగ్రఫీతోసహా ఏదేని ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వహించరాదు లేదా నిర్వహింపజేయరాదు;

[2][(సి) ఏ వ్యక్తియు, గర్భధారణకు ముందు లేదా ఆ తరువాత ఏవిధముగానైననూ, లింగనిర్ధారణ ఎంపికను నిర్వహించరాదు లేదా నిర్వహింపజేయరాదు.]

---

1. ఉప-పరిచ్ఛేదము (2) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.
2. ఖండము (సి) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినది.

## అధ్యాయము - 4
## కేంద్ర పర్యవేక్షణ బోర్డు

కేంద్ర పర్యవేక్షణ బోర్డు యొక్క సంఘటన.

7.(1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టము క్రింద బోర్డుకు ఒసగబడిన అధికారములను వినియోగించుటకు మరియు కృత్యములను నిర్వర్తించుటకు, కేంద్ర పర్యవేక్షణ బోర్డు అని పిలువబడే ఒక బోర్డును సంఘటితము చేయవలెను.

(2) బోర్డు ఈక్రింది వారితో కూడి ఉండవలెను,-

(ఎ) కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ లేక విభాగమునకు బాధ్యతవహించే మంత్రి, ఈయన పదవీరీత్యా ఛైర్మనుగా ఉండవలెను;

(బి) కుటుంబ సంక్షేమ విభాగమునకు బాధ్యత వహించే, భారత ప్రభుత్వ కార్యదర్శి, ఈయన పదవీ రీత్యా వైస్-ఛైర్మనుగా ఉండవలెను;

[1][(సి) మహిళా మరియు శిశు అభివృద్ధిశాఖకు బాధ్యతవహించే కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు మరియు న్యాయ మరియు న్యాయ పాలన మంత్రిత్వ శాఖలోని శాసన వ్యవహారముల విభాగము లేదా శాసనిక శాఖ విభాగమునకు మరియు పదవీరీత్యా భారతీయ వైద్య విధానము మరియు హోమియోపతి శాఖ విభాగమునకు ప్రాతినిధ్యము వహించుటకు కేంద్ర ప్రభుత్వముచే నియమించబడు ముగ్గురు సభ్యులు;]

(డి) కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవల డైరెక్టరు జనరలు, పదవీ రీత్యా;

(ఇ) ఈ క్రింది ప్రతిదాని నుండి ఇద్దరు చొప్పున, కేంద్ర ప్రభుత్వముచే నియమించబడు పదిమంది సభ్యులు,-

(i) ప్రఖ్యాత జన్యుసంబంధ చికిత్స వైద్యుడు;

[1][(ii) ప్రఖ్యాత స్త్రీ జనేంద్రియ చికిత్స వైద్యుడు (గైనకాలజిస్టు) మరియు ప్రసూతి వైద్యులు (ఒబేస్టే ట్రీషియన్స్) లేదా స్త్రీరోగ లేదా ప్రసూతి ప్రక్రియలో నిష్ణాతుడు;]

(iii) ప్రఖ్యాత శిశు చికిత్స వైద్యుడు;

(iv) ప్రఖ్యాత సామాజిక శాస్త్రజ్ఞులు; మరియు

(v) మహిళా సంక్షేమ వ్యవస్థల ప్రతినిధులు;

(ఎఫ్) లోక్‌సభ నుండి ఇద్దరు మరియు రాజ్యసభ నుండి ఒకరు చొప్పున ముగ్గురు మహిళా సభ్యులు;

---

1. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

(జి) వర్ణమాల క్రమములో ఇద్దరు మరియు వ్యతిరేక వర్ణమాల క్రమములో మరొక ఇద్దరు చొప్పున రాజ్యములకు మరియు సంఘ రాజ్య క్షేత్రముల నుండి వంతుల వారీ క్రమములో ప్రాతినిధ్యము వహించుటకు కేంద్ర ప్రభుత్వముచే నియమించబడు నలుగురు సభ్యులు:

అయితే, రాజ్య ప్రభుత్వము లేదా సందర్భానుసారముగా సంఘ రాజ్య క్షేత్రముల సిఫారసుపై తప్ప, ఈ ఖండము క్రింద నియామకము చేయరాదు;

(హెచ్) కుటుంబ సంక్షేమ శాఖకు బాధ్యత వహించు కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి లేదా తత్సమానమైన హోదాకు తక్కువకాని అధికారి, పదవీ రీత్యా సభ్య కార్యదర్శిగా వ్యవహరించవలెను.

సభ్యుల పదవీ కాలావధి.

8.(1) పదవీ రీత్యా సభ్యులు కానట్టి సభ్యుని పదవీ కాలావధి,-

(ఎ) 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) లేదా ఖండము (ఎఫ్) క్రింది నియామకము విషయములో మూడు సంవత్సరములు;

"అయితే 7వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఎఫ్) క్రింద ఎన్నుకొనబడిన కార్యాలయ సభ్యుని పదవీకాలము, సదరు సభ్యుడు మంత్రిగా లేదా సహాయ మంత్రిగా లేదా ఉప మంత్రిగా లేదా లోక్‌సభ సభాపతిగా లేదా ఉపసభాపతిగా లేదా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా అయినపుడు లేదా ఆమె ఎన్నుకొనబడిన సభ యొక్క సభ్యుడుగా ఉండుట విరమించినపుడు ముగియవలెను; మరియు".

(బి) సదరు ఉప-పరిచ్ఛేదపు ఖండము (బి) క్రింది నియామకము విషయములో ఒక సంవత్సరముగా

ఉండవలెను.

(2) మరణము, రాజీనామా లేదా అనారోగ్యము లేదా ఇతర అశక్తత వలన తన కృత్యములను నిర్వర్తించుటలో అసమర్థుడైనందున ఎవరేని ఇతర సభ్యుల పదవీ కాలములో ఏదేని యాదృచ్ఛిక ఖాళీ ఏర్పడినపుడు, కేంద్ర ప్రభుత్వముచే తాజా నియామకము చేయుట ద్వారా అట్టి ఖాళీని భర్తీ చేయవలెను మరియు ఆ విధముగా నియమించబడిన సభ్యుడు తాను ఎవరి స్థానములో నియమించబడినాడో ఆ వ్యక్తి యొక్క మిగిలిన కాలావధి పాటు పదవి యందు కొనసాగవలెను.

(3) ఛైర్మనుచే ఆయాసమయములందు అప్పగించబడునట్టి కృత్యములను వైస్-ఛైర్మను నిర్వర్తించవలెను.

(4) సభ్యులు తమ కృత్యములను విహితపరచబడునట్టి ప్రక్రియననుసరించి నిర్వర్తించవలెను.

బోర్డు యొక్క సమావేశములు.

9.(1) బోర్డు తన సమావేశములందు వ్యవహార నిర్వహణ విషయములో అనుసరించదగు ప్రక్రియ (అట్టి సమావేశములకైన కోరముతోసహా) వినియమముల ద్వారా విహిత పరచబడునట్టి నియమావళిననుసరించి అట్టి సమయములలో మరియు అట్టి ప్రదేశములలో సమావేశము కావలెను:

అయితే, బోర్డు కనీసము ఆరు నెలలకొకసారి సమావేశము కావలెను.

(2) బోర్డు సమావేశములలో ఛైర్మను మరియు ఆయన హాజరులోలేనపుడు వైస్-ఛైర్మన్ దానికి అధ్యక్షత వహించవలెను.

(3) బోర్డు యొక్క ఏదేని సమావేశమునకు ఛైర్మను లేదా వైస్-ఛైర్మను హాజరు కాలేకపోయిన యెడల, ఆ సమావేశమునకు హాజరైన సభ్యులచే ఎంపికచేసుకొనబడిన ఎవరేని ఇతర సభ్యుడు ఆ సమావేశమునకు అధ్యక్షత వహించవలెను.

(4) బోర్డు యొక్క ఏదేని సమావేశము సమక్షమునకు వచ్చిన ప్రశ్నలన్నింటిని, అందుహాజరై ఓటుచేసిన అధిక సంఖ్యలోని సభ్యుల ద్వారా నిర్ణయించడం జరుగుతుంది మరియు ఓట్లు సమానముగా వచ్చిన సందర్భములో ఛైర్మను లేదా ఆయన హాజరులో లేనపుడు అధ్యక్షత వహించు వ్యక్తి రెండవ లేదా నిర్ణాయక ఓటును కలిగి ఉండును.

(5) పదవీ రీత్యా సభ్యులు కానట్టి ఇతర సభ్యులు, విహితపరచబడునట్టి ఏవేని భత్యములను బోర్డు నుండి స్వీకరించవలెను.

ఖాళీలు మొదలైన వాటి వలన బోర్డు యొక్క చర్యలు శాసనమాన్యత లేనివిగా చేయవు.

10. ఈ క్రింది కారణముల మాత్రముననే బోర్డు యొక్క ఏదేని చర్య లేదా ప్రొసీడింగులు శాసనమాన్యము లేనివిగా చేయవు,-

(ఎ) బోర్డు యొక్క సంఘటనలో ఏదేని లోపము లేదా ఏదేని ఖాళీ ఉండుట;

(బి) బోర్డు సభ్యుడుగా పనిచేయుచున్న వ్యక్తి యొక్క నియామకములో ఏదేని లోపము; లేదా

(సి) కేసుకు సంబంధించిన యోగ్యతలకు భంగము వాటిల్లకుండా బోర్డు యొక్క ప్రక్రియలోగల ఏదేని క్రమరాహిత్యత.

కొన్ని ప్రత్యేక ప్రయోజనముల నిమిత్తము బోర్డులోని వ్యక్తుల యొక్క తాత్కాలిక సహసంబంధము.

11.(1) బోర్డు, ఈ చట్టము యొక్క ఏవేని నిబంధనలను నెరవేర్చుటలో, వినియమముల ద్వారా నిర్ధారించబడునట్టి రీతిలో మరియు అట్టి ప్రయోజనముల కొరకు తాను స్వయంగా ఆశించునట్టి సహాయము లేదా సలహా అవసరమైనపుడు ఎవరేని వ్యక్తితో సహసంబంధము పెట్టుకొనవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఏదేని ప్రయోజనము కొరకు బోర్డుతో సహసంబంధము పెట్టుకొనిన వ్యక్తి, ఆ ప్రయోజనమునకు సంబంధించిన చర్చలలో పాల్గొనుటకు హక్కు కలిగివుండును. కానీ బోర్డు సమావేశములో ఓటు చేయుటకు హక్కు కలిగి ఉండడు మరియు ఏదేని ఇతర ప్రయోజనము నిమిత్తము దాని యొక్క సభ్యునిగా ఉండరాదు.

బోర్డు యొక్క అధికారులు మరియు ఇతర ఉద్యోగుల నియామకము.

12.(1) ఈ చట్టము క్రింద బోర్డు తన యొక్క కృత్యములను సమర్ధవంతముగా నిర్వర్తించుటకు, ఈ విషయములో చేయబడు వినియమములకు లోబడి ప్రతినియుక్తి (డెప్యుటేషనుపై లేదా ఇతర విధముగా) తాను అవసరమని భావించునంత మంది అధికారులను మరియు ఇతర ఉద్యోగులను నియమించుకొనవచ్చును:

అయితే, వినియమములలో నిర్దిష్టపరచబడునట్టి శ్రేణి అధికారుల నియామకము, కేంద్ర ప్రభుత్వ ఆమోదమునకు లోబడి ఉండును.

(2) బోర్డుచే నియమించబడిన ప్రతి అధికారి లేదా ఇతర ఉద్యోగి వినియమములలో నిర్దిష్టపరచబడునట్టి సేవా షరతులకు మరియు ప్రతిఫలమును పొందుటకు హక్కు కలిగి ఉందురు.

బోర్డు యొక్క ఉత్తర్వులు మరియు ఇతర పత్రముల యొక్క అధిప్రమాణీకరణ.

13. బోర్డు యొక్క ఉత్తర్వులు మరియు నిర్ణయములన్నియు ఛైర్మను లేదా ఈ విషయములో బోర్డుచే ప్రాధికారమొసగబడిన ఎవరేని ఇతర సభ్యుని సంతకముతో అధిప్రమాణీకరించబడవలెను మరియు బోర్డుచే జారీచేయబడినట్టి ఇతర పత్రములన్నియు, సభ్యకార్యదర్శి లేదా ఈ విషయములో అదే రీతిలో ప్రాధికారమీయబడినట్టి బోర్డు యొక్క ఎవరేని ఇతర అధికారి యొక్క సంతకముతో అధిప్రమాణీకరించబడవలెను.

సభ్యునిగా నియామకము కొరకు అనర్హత.

14. ఈ క్రింది సందర్భములలో ఒక వ్యక్తి సభ్యునిగా నియమించబడుటకు అనర్హుడు అగును,-

(ఎ) కేంద్ర ప్రభుత్వము యొక్క అభిప్రాయములో, నీతిబాహ్యతతో కూడిన అపరాధమునకు దోషస్థాపన చేయబడి కారాగారవాస శిక్ష విధించబడిన; లేదా

(బి) అనున్ముక్త దివాలాదారుగా ఉన్నప్పుడు; లేదా

(సి) మతిస్థిమితము లేని మరియు అట్లని సమర్థ న్యాయస్థానముచే ప్రకటించబడిన యెడల; లేదా

(డి) ప్రభుత్వ యాజమాన్యములో లేదా దానిచే నియంత్రించబడు లేదా కార్పొరేషనులోని ప్రభుత్వ సేవ నుండి బర్తరఫ్ చేయబడిన లేదా తొలగించబడిన యెడల;

(ఇ) కేంద్ర ప్రభుత్వము యొక్క అభిప్రాయములో బోర్డు యందలి ఆర్థిక లేదా ఇతర అతని హితము వలన సభ్యుడుగా తన కృత్యముల నిర్వహణలో ప్రతికూల ప్రభావము కలగవచ్చునని భావించిన యెడల; లేదా

[1][(ఎఫ్) కేంద్ర ప్రభుత్వము యొక్క అభిప్రాయములో, ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించు లేదా ప్రోత్సహించు వారితో లేదా ఏదేని లింగ నిర్ధారణ సాంకేతిక ప్రకియతో సహసంబంధము కలిగియున్నట్లు భావించిన యెడల.]

---

1. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

సభ్యునిగా తిరిగి నియామకము కొరకు పాత్రత.

15. విహితపరచబడునట్టి నిబంధనలు మరియు ఇతర సేవా షరతులకు లోబడి, సభ్యునిగా ఉండుట నుండి విరమించు ఎవరేని వ్యక్తి, అట్టి సభ్యునిగా తిరిగి నియామకము కొరకు పాత్రుడై ఉండును:

[1][అయితే, పదవీ రీత్యా సభ్యుడుకాని ఏ వ్యక్తియు రెండు క్రమానుగత పదవీ కాలములకు మించి సభ్యునిగా నియమించబడరాదు.]

బోర్డు యొక్క కృత్యములు.

[2][16. బోర్డు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా,-

(i) ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను, లింగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించుట మరియు వాటి దుర్వినియోగమునకు సంబంధించిన విధివిధాన విషయాలలో కేంద్ర ప్రభుత్వమునకు సలహానిచ్చుట;

(ii) ఈ చట్టపు మరియు దానిక్రింద చేయబడినట్టి నియమముల అమలును పునర్విలోకన చేయుట మరియు పర్యవేక్షించుట మరియు సదరు చట్టము మరియు నియమములలో మార్పులు చేయుటకై కేంద్ర ప్రభుత్వమునకు సిఫారసు చేయుట;

(iii) గర్భధారణ పూర్వ మరియు స్త్రీ భ్రూణ హత్యలకు దారితీయు మరియు ప్రసవ పూర్వ లింగ నిర్ధారణా చర్యలకు వ్యతిరేకముగా ప్రజలలో అవగాహనను కలిగించుట;

(iv) జన్యు సంబంధ సలహా కేంద్రములు, జన్యు సంబంధ ప్రయోగశాలలు మరియు జన్యుసంబంధ వైద్యశాలలో పనిచేసే వ్యక్తులు పాటించవలసిన ప్రవర్తన నియమావళిని నిబంధించుట;

(v) ఈ చట్టము క్రింద సంఘటితము చేయబడిన అనేక నికాయముల నిర్వర్తనను పర్యవేక్షించుట మరియు దానిని సరిగాను మరియు సమర్థవంతంగానూ అమలుచేయుటకై సముచితమైన చర్యలను కట్టుదిట్టంగా జరిపించుట;

(vi) చట్టము క్రింద విహితపరచబడునట్టి ఏవేని ఇతర కృత్యములు.]

రాజ్యము యొక్క పర్యవేక్షక బోర్డు మరియు సంఘ రాజ్య క్షేత్రముల యొక్క పర్యవేక్షక బోర్డు సంఘటన.

[3][16ఏ.(1) శాసనమండలిని కలిగి ఉన్న ప్రతిరాజ్య మరియు సంఘ రాజ్య క్షేత్రము రాజ్య పర్యవేక్షక బోర్డు లేదా సందర్భానుసారము సంఘ రాజ్య క్షేత్ర పర్యవేక్షక బోర్డు అని పిలువబడే, బోర్డును సంఘటితము చేయవలెను. అవి ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా,-

(i) రాజ్యములో గర్భధారణ పూర్వ మరియు స్త్రీ భ్రూణ హత్యలకు దారితీయు మరియు ప్రసవ పూర్వ లింగ నిర్ధారణ చర్యలకు వ్యతిరేకముగా ప్రజలలో అవగాహనను కలిగించుట;

---

1. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి వినాయింపు ఉంచబడినది.
2. 2003లోని 14వ చట్టము ద్వారా 16వ పరిచ్ఛేదము 14-2-2003 నుండి ఉంచబడినది.
3. 2003లోని 14వ చట్టము ద్వారా 16-ఏ పరిచ్ఛేదము 14-2-2003 నుండి ఉంచబడినది.

(ii) రాజ్యములో పనిచేస్తున్న సముచిత ప్రాధికార సంస్థల కార్యకలాపాలను పునర్విలోకన చేసి మరియు వాటిపై సముచితమైన చర్యకు సిఫారసు చేయుట;

(iii) ఈ చట్టపు నిబంధనల మరియు దానిక్రింద చేయబడిన నియమముల అమలును పర్యవేక్షించుట మరియు వాటికి సంబంధించి బోర్డుకు తగిన సిఫారసులను చేయుట;

(iv) చట్టము క్రింద రాజ్యములో చేపట్టే వివిధ కార్యకలాపముల విషయములో విహితపరచబడునట్టి సంఘటిత నివేదికలను బోర్డుకు మరియు కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను; మరియు

(v) చట్టము క్రింద విహితపరచబడునట్టి ఏవేని ఇతర కృత్యములు.

(2) రాజ్య బోర్డు ఈ క్రిందివారితో కూడి యుండవలెను, -

(ఎ) రాజ్యములో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖకు బాధ్యత వహించు మంత్రి, పదవీ రీత్యా ఛైర్-పర్సనుగా ఉండవలెను;

(బి) ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ విభాగమునకు బాధ్యత వహించు కార్యదర్శి, పదవీ రీత్యా వైస్-ఛైర్-పర్సనుగా ఉండవలెను;

(సి) మహిళా మరియు శిశు అభివృద్ధి, సాంఘిక సంక్షేమ, న్యాయ మరియు భారతీయ ఔషధ విధానము మరియు హోమియోపతి విభాగముల కార్యదర్శులు లేదా కమీషనర్లు లేదా వారి ప్రతినిధులు పదవీరీత్యా సభ్యులు;

(డి) రాజ్య ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ లేదా భారతీయ ఔషధ విధానము మరియు హోమియోపతి డైరెక్టరు- పదవీ రీత్యా సభ్యులు;

(ఇ) శాసనసభ లేదా శాసనమండలి యొక్క ముగ్గురు మహిళా సభ్యులు;

(ఎఫ్) ఈ క్రింది శ్రేణుల నుండి ఇద్దరు చొప్పున రాజ్య ప్రభుత్వముచే నియమించబడు పదిమంది సభ్యులు,-

(i) ప్రఖ్యాత సామాజిక శాస్త్రజ్ఞులు మరియు న్యాయశాస్త్ర నిష్ణాతులు;

(ii) ప్రభుత్వేతర వ్యవస్థల నుండి లేదా ఇతర విధముగా క్రియాశీలురైన ప్రఖ్యాత మహిళలు;

(iii) ప్రఖ్యాత స్త్రీ జననేంద్రియ చికిత్స వైద్యులు (గైనకాలజిస్టులు) మరియు ప్రసూతి వైద్యులు (ఒబేస్ట్రిటీషియన్సు) లేదా స్త్రీరోగ లేదా ప్రసూతి ప్రక్రియలో నిష్ణాతులు;

(iv) ప్రఖ్యాత శిశుచికిత్స వైద్యులు (పిడియాట్రిషియన్స్) లేదా జన్యుసంబంధ చికిత్స వైద్యులు (మెడికల్ జెనెటిసిస్ట్స్);

(v) ప్రఖ్యాత రేడియోలజిస్టులు లేదా ధ్వని సంబంధ చికిత్స వైద్యులు (సోనోలజిస్టులు).

(జి) కుటుంబ సంక్షేమ శాఖకు బాధ్యత వహించు సంయుక్త డైరెక్టరు హోదాకు తక్కువకాని అధికారి - పదవీరీత్యా సభ్య కార్యదర్శి.

(3) రాజ్య బోర్డు కనీసము నాలుగు నెలలకొకసారి సమావేశము కావలెను.

(4) పదవీరీత్యా సభ్యుడుకానట్టి ఇతర సభ్యుని పదవీ కాలము మూడు సంవత్సరములు.

(5) పదవీరీత్యా సభ్యుడు కానట్టి ఎవరేని ఇతర సభ్యుని పదవిలో ఖాళీ ఏర్పడినపుడు, తాజా నియామకము చేయుట ద్వారా దానిని భర్తీ చేయవలెను.

(6) రాజ్య బోర్డు సభ్యునిగా ఉన్న శాసనసభ సభ్యుడు లేదా శాసనమండలి సభ్యుడు, మంత్రి లేదా శాసన సభాపతి లేదా ఉప-సభాపతి లేదా శాసనమండలి ఛైర్-పర్సను లేదా డెప్యూటీ ఛైర్-పర్సను అయినపుడు, అతడు రాజ్య బోర్డు సభ్యుడుగా ఉండుట నుండి విరమించవలెను.

(7) రాజ్య బోర్డు యొక్క మొత్తము సభ్యులలో మూడింట ఒక వంతు మంది కోరముగా ఏర్పడవలెను.

(8) అవసరమైనపుడెల్లను రాజ్య బోర్డు సభ్యులను కోఆప్టు చేసుకొనవచ్చును. అయితే, అట్లు కో-ఆప్టు చేసుకొనబడిన సభ్యులు ఆ రాజ్య బోర్డు యొక్క మొత్తము సభ్యులలో మూడింట ఒక వంతు మందికి మించి ఉండరాదు.

(9) కో-ఆప్టు చేసుకొనబడిన సభ్యులు ఇతర సభ్యులు మాదిరిగానే అవే అధికారములు మరియు కృత్యములను కలిగిఉందురు. అయితే వీరికి ఓటుచేయు హక్కు మాత్రము ఉండదు మరియు నియమములు మరియు వినియమములకు బద్ధులై ఉండవలెను.

(10) ఈ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచబడని విషయములకు సంబంధించి, బోర్డుకు వర్తించదగు ప్రక్రియలు మరియు షరతులను రాజ్య బోర్డు పాటించవలెను.]

## అధ్యాయము - 5
## సముచిత ప్రాధికార సంస్థ మరియు సలహా కమిటీ

సముచిత ప్రాధికార సంస్థ మరియు సలహా కమిటీ

17.(1) కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా, ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము ప్రతి సంఘ రాజ్య క్షేత్రమునకు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సముచిత ప్రాధికార సంస్థలను నియమించవలెను.

(2) రాజ్య ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము స్త్రీ భ్రూణ హత్యలకు దారితీయు ప్రసవ పూర్వ లింగ నిర్ధారణ సమస్యల యొక్క తీవ్రతను బట్టి, రాజ్య మంతటికి లేదా అందలి భాగమునకు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సముచిత ప్రాధికార సంస్థలను నియమించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (1) లేదా (2)ల క్రింద సముచిత ప్రాధికారులుగా నియమించబడిన అధికారులు,-

(ఎ) ఒక రాజ్యము లేదా సంఘ రాజ్య క్షేత్రము అంతటికిని నియమించబడినపుడు, ఈ క్రింది ముగ్గురు సభ్యులను కలిగియుండవలెను,-

(i) ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జాయింటు డైరెక్టరు లేదా అంతకంటే ఎక్కువ హోదాగల అధికారి - ఛైర్-పర్సన్;

(ii) మహిళా వ్యవస్థకు ప్రాతినిధ్యము వహించు ఒక ప్రఖ్యాత మహిళ;

(iii) సంబంధిత రాజ్య లేదా సంఘ రాజ్య క్షేత్రము యొక్క న్యాయ విభాగము అధికారి:

అయితే, ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలు (క్రమబద్ధముచేయు మరియు దుర్వినియోగ నివారణ) సవరణ చట్టము, 2002 అమలులోనికి వచ్చిన మూడు నెలల లోపల రాజ్య లేదా సంఘ రాజ్య క్షేత్రస్థాయిలో బహుళ సభ్యులతో కూడిన సముచిత ప్రాధికార సంస్థను ఏర్పాటుచేయుట లేదా సంబంధిత రాజ్య లేదా సంఘరాజ్య క్షేత్రము యొక్క కర్తవ్యమై ఉండవలెను.

అయితే ఇంకనూ, అందులో ఏదేని ఖాళీ ఏర్పడినపుడు, ఖాళీ ఏర్పడినప్పటి నుండి మూడు నెలలలోపుగా దానిని భర్తీచేయవలెను.

(బి) రాజ్యము లేదా సంఘ రాజ్య క్షేత్రములోని ఏదేని భాగమునకు నియమించ బడినపుడు, రాజ్య ప్రభుత్వము లేదా సందర్భానుసారము కేంద్ర ప్రభుత్వము తాము సముచితమని భావించునట్టి ఇతర హోదా గల వారిని నియమించ వచ్చును.

(4) సముచిత ప్రాధికార సంస్థ ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా,-

(ఎ) జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల యొక్క రిజిస్ట్రీకరణ మంజూరు, తాత్కాలిక తొలగింపు లేక రద్దుచేయుట;

(బి) జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల మరియు జన్యుసంబంధ వైద్యశాల కొరకు విహితపరచబడిన ప్రమాణములను అమలుచేయుట;

(సి) ఈ చట్టము నిబంధనలు లేదా దానిలో చేయబడిన నియమముల ఉల్లంఘన లకు సంబంధించిన ఫిర్యాదులను దర్యాప్తు చేయుట మరియు సత్వర చర్యలను తీసుకొనుట; మరియు

(డి) రిజిస్ట్రీకరణ కొరకైన దరఖాస్తుపై మరియు రిజిస్ట్రీకరణ తాత్కాలిక తొలగింపు లేదా రద్దు యొక్క ఫిర్యాదుపై ఉప-పరిచ్ఛేదము (5) క్రింద సంఘటితము చేయబడిన సలహా కమిటీ యొక్క సలహాను కోరుట మరియు దానిని పర్యాలోచించుట;

(ఇ) ఏదేని ప్రదేశములో, ఎవరేని వ్యక్తిచే ఏదేని లింగ నిర్ధారణను సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించమని తనంతట తానుగా తెలుసుకొనిన లేదా తనకు తెలియజేయబడినచో మరియు అట్టి విషయముపై స్వతంత్ర దర్యాప్తులు ఆరంభించుట మరియు సముచిత న్యాయపరమైన చర్యను తీసుకొనుట;

(ఎఫ్) లింగ నిర్ధారణ ఎంపిక చేయు ఆచరణ లేదా ప్రసవ పూర్వ లింగ నిర్ధారణపై ప్రజలలో అవగాహనను కలిగించుట;

(జి) ఈ చట్టపు నిబంధనలు మరియు నియమముల అమలును పర్యవేక్షించుట;

(హెచ్) మారుతున్న సాంకేతిక శాస్త్రము లేదా సామాజిక పరిస్థితులననుసరించి నియమములలో అవసరమైన మార్పులను గురించి బోర్డు మరియు రాజ్య బోర్డులకు సిఫారసు చేయుట;

(ఐ) రిజిస్ట్రీకరణ యొక్క తాత్కాలిక తొలగింపు లేదా రద్దు కొరకైన ఫిర్యాదుల దర్యాప్తు తరువాత సలహా కమిటీ చేయు సిఫారసులపై తదుపరి చర్య తీసుకొనుట.

(5) సముచిత ప్రాధికార సంస్థ తన కృత్యములను నిర్వర్తించుటలో సహాయము మరియు సలహానిచ్చుటకు కేంద్ర ప్రభుత్వము లేదా సందర్భానుసారము రాజ్యప్రభుత్వము ప్రతి సముచిత ప్రాధికార సంస్థకు ఒక సలహా కమిటీని ఏర్పాటుచేయవలెను. మరియు సలహా కమిటీ సభ్యులలో నుండి ఒకరిని దానికి ఛైర్మనుగా నియమించవలెను.

(6) సలహా కమిటీ ఈ క్రింది వారితో కూడి ఉండవలెను,-

(ఎ) స్త్రీ జననేంద్రియ చికిత్సవైద్యులు, ప్రసూతి వైద్యులు, శిశు చికిత్స వైద్యులు మరియు జన్యుసంబంధ చికిత్స వైద్యులు నుండి ముగ్గురు వైద్య నిష్ణాతులు;

(బి) ఒక న్యాయ నిష్ణాతుడు;

(సి) రాజ్య ప్రభుత్వ లేదా సందర్భానుసారముగా సంఘ రాజ్య క్షేత్రము యొక్క సమాచార మరియు ప్రచార విభాగమునకు ప్రాతినిధ్యము వహించుటకు ఒక అధికారి;

(డి) ముగ్గురు ప్రముఖ సంఘ సేవకులు, అందులో ఒకరికి తక్కువ కాకుండా మహిళా వ్యవస్థల ప్రతినిధుల నుండి ఉండవలెను;

[1][(7) లింగ నిర్ధారణ లేదా లింగ నిర్ధారణ ఎంపిక కొరకైన ప్రసవ పూర్వ రోగనిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను ఉపయోగించు లేదా వాటిని ప్రోత్సహించుట లేదా వాటితో సహసంబంధమున్న ఏ వ్యక్తియు సలహా కమిటీకి సభ్యుడుగా నియామకము చేయబడరాదు.]

(8) సలహా కమిటీ తాను సముచితమని భావించినపుడు లేదా సముచిత ప్రాధికార సంస్థ యొక్క అభ్యర్థనపై, రిజిస్ట్రీకరణ కొరకైన ఏదేని దరఖాస్తును లేదా రిజిస్ట్రీకరణ యొక్క తాత్కాలిక నిలుపుదల లేదా రద్దు కొరకైన ఏదేని ఫిర్యాదును పర్యాలోచించుటకు మరియు దానిపై సలహా నిచ్చుటకు సమావేశము కావచ్చును:

అయితే, ఏవేని రెండు సమావేశముల మధ్య ఉండే కాలావధి, విహితపరచబడునట్టి కాలావధికి మించరాదు.

(9) సలహా కమిటీకి, ఒక వ్యక్తి నియామకమునకైన నిబంధనలు మరియు షరతులు సదరు కమిటీ తన కృత్యములను నిర్వర్తించుటలో అనుసరించవలసిన ప్రక్రియ విహితపరచబడునట్టివిగా ఉండవలెను.

సముచిత ప్రాధికార సంస్థల యొక్క అధికారములు.

[2][17ఏ. సముచిత ప్రాధికార సంస్థ, ఈ క్రింది విషయములలో అధికారములు కలిగి ఉండును, అవేవనగా,-

(ఎ) ఈ చట్టపు నిబంధనలు లేదా వాటి క్రింద చేయబడిన నియమముల యొక్క ఉల్లంఘనలకు సంబంధించిన ఏదేని సమాచారమును తన అధీనములో కలిగి ఉన్న ఎవరేని వ్యక్తిని సమను చేయుటకు;

(బి) ఖండము (ఎ)కు సంబంధించిన ఏదేని దస్తావేజు లేదా ముఖ్యమైన వస్తువును సమర్పించుటకు;

(సి) ప్రసవ పూర్వ లింగ నిర్ధారణ లేదా లింగ నిర్ధారణ ఎంపిక సాంకేతిక ప్రక్రియలతో కూడియున్నట్లుగా అనుమానించబడిన ఏదేని ప్రదేశము కొరకు సోదా వారెంటును జారీచేయుట;

(డి) విహితపరచబడునట్టి ఏదేని ఇతర విషయము.]

1. ఉప-పరిచ్ఛేదము (7) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.
2. పరిచ్ఛేదము 7-ఏ 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

## అధ్యాయము - 6
## జన్యుసంబంధ సలహా కేంద్రములు, జన్యుసంబంధ ప్రయోగశాలలు మరియు జన్యు సంబంధ వైద్యశాలల రిజిస్ట్రీకరణ

జన్యు సంబంధ సలహా కేంద్రములు, జన్యు సంబంధ చికిత్సాలయాల లేదా జన్యు సంబంధ వైద్యశాలల రిజిస్ట్రీకరణ.

[1][18.(1) ఈ చట్టము క్రింద తగురీతిగా రిజిస్టరు చేయబడిననే తప్ప, ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల (క్రమబద్ధము చేయు మరియు దుర్వినియోగ నివారణ) సవరణ చట్టము, 2002 ప్రారంభమైన తరువాత అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాల (క్లినిక్) ఈ చట్టము క్రింద రిజిస్ట్రీకరణ చేయబడిననే తప్ప, భ్రూణము యొక్క లింగ నిర్ధారణ మరియు లింగ నిర్ధారణ ఎంపికలు లేదా వాటిలో ఏదేని సేవ చేయగల అల్ట్రాసౌండ్ లేదా ప్రతిబింబ (ఇమేజింగ్) యంత్రము లేదా శోధకము లేదా ఇతర సాంకేతికత శాస్త్రమును కలిగి ఉన్న క్లినిక్, ప్రయోగశాల లేదా కేంద్రముతో సహా ఏదేని జన్యు సంబంధమైన సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యుసంబంధ వైద్యశాలను ఏ వ్యక్తియు ప్రారంభించరాదు.]

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్ట్రీకరణ కొరకైన ప్రతి దరఖాస్తు విహితపరచబడునట్టి రీతిలో, అట్టి ప్రరూపములో అట్టి ఫీజుతోపాటు సముచిత ప్రాధికార సంస్థకు చేయబడవలెను.

(3) ఈ చట్టము యొక్క ప్రారంభమునకు ముందు, వెంటనే 4వ పరిచ్ఛేదములో పేర్కొనబడిన ఏదేని ప్రయోజనము కొరకు ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను నిర్వహించుట లేదా సలహా ఇచ్చుటలో భాగతః లేదా ప్రత్యేకముగా నిమగ్నమై ఉన్న ప్రతి జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల, చట్టము యొక్క అట్టి ప్రారంభపు తేదీ నుండి అరవై దినముల లోపల రిజిస్ట్రీకరణ కొరకు దరఖాస్తు చేసుకొనవలెను.

(4) 6వ పరిచ్ఛేదపు నిబంధనలకు లోబడి, ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలో సలహానిచ్చుట మరియు వాటిని నిర్వహించుటలో నిమగ్నమైయున్న ప్రతి జన్యుసంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాల, రిజిస్ట్రీకరణ కొరకు దరఖాస్తు చేసియుండి, ఆ దరఖాస్తు పరిష్కరించబడునంత వరకు లేదా అది సంయుక్తముగా లేదా విడిగా రిజిస్టరు చేయబడినంత వరకు వీటిలో ఏది ముందయితే అంతవరకు తప్ప, ఈ చట్టము ప్రారంభ తేదీ నుండి ఆరు నెలలు గడిచిన మీదట అట్టి సలహా లేదా సాంకేతిక ప్రక్రియను సమకూర్చుట నుండి విరమించవలెను.

---

1. ఉప-పరిచ్ఛేదము (1) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

(5) జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల విహితపరచబడునట్టి సౌకర్యములను సాధన సామగ్రిని సమకూర్చగల మరియు నిర్వహణ ప్రమాణములను పాటించగలవని సముచిత ప్రాధికార సంస్థ సంతృప్తి చెందిననే తప్ప, ఈ చట్టము క్రింద అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాలను రిజిస్టరు చేయరాదు.

రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము.

19.(1) సముచిత ప్రాధికార సంస్థ, పరిశీలన జరిపిన మీదట, మరియు ఈ చట్టము మరియు దానిక్రింద చేయబడిన నియమముల యొక్క ఆవశ్యకతలన్నింటిని దరఖాస్తుదారు పాటించినట్లు సంతృప్తి చెందిన పిమ్మట మరియు ఈ విషయములో సలహా కమిటీ యొక్క సలహాకు తగిన ప్రాధాన్యమిస్తూ, విహితప్రరూపములో సంయుక్తముగా లేదా విడిగా జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యుసంబంధ ప్రయోగశాల లేదా సందర్భానుసారముగా జన్యు సంబంధ వైద్యశాలకు రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును మంజూరీ చేయవలెను.

(2) సముచిత ప్రాధికార సంస్థ విచారణ జరిపిన మీదట మరియు దరఖాస్తు దారుకు విన్నవించుకొనుటకు అవకాశమును ఇచ్చిన మీదటను మరియు సలహా కమిటీ యొక్క సలహాకు ప్రాధాన్యతనిస్తూ, దరఖాస్తుదారు ఈ చట్టము మరియు దానిక్రింద చేయబడిన నియమముల ఆవశ్యకతలను పాటించలేదని, వ్రాతపూర్వకముగా రికార్డు చేయదగు తన కారణములపై, రిజిస్ట్రీకరణ కొరకైన దరఖాస్తును తిరస్కరించవలెను.

(3) ప్రతి రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము, విహితపరచబడినట్టి ఫీజును చెల్లించిన మీదట, అట్టి రీతిలో మరియు అట్టి ప్రరూపములో నవీకరించబడవలెను.

(4) రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల తన వ్యాపార స్థలములో అందరికి కనిపించు స్థలములో ప్రదర్శించవలెను.

రిజిస్ట్రీకరణ యొక్క రద్దు మరియు తాత్కాలిక బర్తరఫు.

20.(1) సముచిత ప్రాధికార సంస్థ తనంతట తానుగా లేదా ఫిర్యాదు అందిన మీదట, జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలకు నోటీసులో పేర్కొనిన కారణముల నిమిత్తము దాని రిజిస్ట్రీకరణను ఎందుకు తాత్కాలికముగా బర్తరఫుచేయరాదో లేక రద్దుచేయరాదో కారణము చూపవలసిందని నోటీసును జారీచేయవలెను.

(2) సలహా కమిటీ యొక్క సలహా మేరకు, జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలకు విన్నవించుకొనుటకు తగిన అవకాశమిచ్చిన మీదట, ఈ చట్టపు నిబంధనలు లేదా దానిక్రింద చేయబడిన నియమముల ఉల్లంఘన జరిగినదని సముచిత ప్రాధికార సంస్థ సంతృప్తి చెందిన యెడల, అట్టి కేంద్రము,

ప్రయోగశాల లేదా వైద్యశాలపై తీసుకొనదగు ఏదేని క్రిమినలు చర్యకు భంగము వాటిల్లకుండా, తాను ఉచితమని భావించునట్టి కాలావధి పాటు దాని రిజిస్ట్రీకరణను బర్తరఫు చేయవచ్చును లేదా సందర్భానుసారముగా రద్దు చేయవచ్చును.

(3) ఉప-పరిచ్ఛేదములు (1) మరియు (2)లలో ఏమి ఉన్నప్పటికిని, ప్రజాహితము దృష్ట్యా అట్లుచేయుట అవసరమని లేదా ఆవశ్యకమని సముచిత ప్రాధికార సంస్థ భావించినచో ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దేశించబడినట్టి నోటీసు జారీచేయకుండానే వ్రాతపూర్వకముగా రికార్డు చేయదగు కారణముల నిమిత్తము ఏదేని జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల యొక్క రిజిస్ట్రీకరణను తాత్కాలికముగా బర్తరఫు చేయవచ్చును.

అపీలు.

21. 20వ పరిచ్ఛేదము క్రింద, సముచిత ప్రాధికార సంస్థచే జారీచేయబడిన తాత్కాలిక బర్తరఫు లేదా రద్దు ఉత్తర్వు అందిన తేదీ నుండి ముప్పై దినములలోపల, జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల అట్టి ఉత్తర్వుపై, విహితరీతిలో ఈ క్రింది వారికి,-

(i) అపీలు కేంద్ర సముచిత ప్రాధికార సంస్థ యొక్క ఉత్తర్వుకి విరుద్ధముగా ఉన్న యెడల కేంద్రప్రభుత్వమునకు; మరియు

(ii) అపీలు రాజ్య సముచిత ప్రాధికార సంస్థ యొక్క ఉత్తర్వుకి విరుద్ధముగా ఉన్నయెడల రాజ్యప్రభుత్వమునకు

అపీలు చేసుకొనవచ్చును.

## అధ్యాయము - 7

## అపరాధములు మరియు శాస్తులు

గర్భధారణ పూర్వ మరియు ప్రసవ పూర్వ లింగ నిర్ధారణకు సంబంధించిన ప్రకటనల నిషేధమును ఉల్లంఘించినందుకు శిక్ష.

[1][22.(1) అల్ట్రాసౌండ్ యంత్రము లేదా ప్రతిబింబ (ఇమేజింగు) యంత్రము లేదా శోధకము లేదా భ్రూణము యొక్క లింగ నిర్ధారణ లేదా లింగ నిర్ధారణ చేపట్టగల ఏదేని ఇతర సాంకేతిక శాస్త్ర ప్రక్రియలను కలిగి ఉన్న వైద్యశాల (క్లినిక్) ప్రయోగశాల లేదా కేంద్రముతోసహా ఎవరేని వ్యక్తి, వ్యవస్థ, జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల యైనను, అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాల ఏదేని ఇతర స్థలములో గర్భధారణ పూర్వ లింగ నిర్ధారణ లేదా ప్రసవ పూర్వ లింగ నిర్ధారణ కొరకు లభ్యముగా ఉన్న సౌకర్యముల విషయములో ఇంటర్ నెట్ తోసహా ఏదేని ప్రరూపములో ప్రకటన యొక్క జారీ, ప్రచురణ, పంపిణీ లేదా తెలియజేయుట లేదా జారీచేయించుట, ప్రచురింపజేయుట, పంపిణీ చేయించుట లేదా తెలియజేయించుట చేయరాదు.

---

1. 22వ పరిచ్ఛేదము 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

(2) జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలతోసహా శాస్త్రీయముగా లేదా ఏవిధముగానైనను, ఏదేని రీతిలో గర్భధారణ పూర్వ లింగ నిర్ధారణ లేదా లింగ నిర్ధారణను గురించి తెలియజేయు ఏదేని ప్రకటనను, ఏ వ్యక్తి లేదా వ్యవస్థ జారీచేయరాదు, ప్రచురించరాదు, పంపిణీ చేయరాదు, తెలియజేయరాదు లేదా జారీచేయించరాదు, ప్రచురింపజేయరాదు, పంపిణీ చేయించరాదు లేదా తెలియజేయించరాదు.

(3) ఉప-పరిచ్ఛేదము (1) లేదా ఉప-పరిచ్ఛేదము (2) యొక్క నిబంధనలను ఉల్లంఘించు ఏ వ్యక్తి అయినను మూడు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారాగారవాసముతోను మరియు పదివేల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను శిక్షింపబడవలెను.

<u>విశదీకరణ:-</u> ఈ పరిచ్ఛేదపు ప్రయోజనముల నిమిత్తము "ప్రకటన" అను పదములో ఇంటర్ నెట్ లేదా ఏదేని ఇతర మాధ్యమము ద్వారా ఎలక్ట్రానిక్ లేదా ప్రింటు రూపములోని ఏదేని నోటీసు, సర్క్యులరు, లేబిలు, రేపరు లేదా ఏదేని ఇతర పత్రము చేరి ఉండును మరియు ఏదేని హోర్డింగు, కుడ్య చిత్రం, సిగ్నలు, వెలుతురు, ధ్వని, పొగ లేదా గ్యాసు ద్వారా చేయబడిన దృశ్యరూప దర్శనము కూడా చేరియుండును.]

అపరాధములు మరియు శాస్తులు.

23.(1) జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలను స్వంతంగా కలిగి ఉన్న అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాలలో గౌరవ ప్రాతిపదికపై లేదా ఇతర విధంగా నియమించబడిన ఎవరేని జన్యుసంబంధ చికిత్స వైద్యుడు, స్త్రీ జననేంద్రియ చికిత్స వైద్యుడు రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు లేదా ఎవరేని వ్యక్తి ఈ చట్టపు నిబంధనలు లేదా దానిక్రింద చేయబడిన నియమములను ఉల్లంఘించిన యెడల మూడు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారాగారవాసముతోను మరియు పదివేల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను మరియు తరువాతి ఏదేని దోషస్థాపనకు ఐదుసంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారాగారవాసముతోను మరియు యాభైవేల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను శిక్షించబడవలెను.

[1][(2) సముచిత ప్రాధికార సంస్థ, ఎవరేని రిజిస్ట్రీకృత వైద్యదారునిపై న్యాయస్థానములో అభియోగములు మోపబడి, కేసు పరిష్కరింపబడునంతవరకు అతని రిజిస్ట్రేషనును తాత్కాలికముగా నిలిపి ఉంచుటతోసహా తగిన చర్యను తీసుకొనుటకు, మరియు అతను దోషస్థాపితుడైన యెడల మొదటిసారికి ఐదుసంవత్సరముల కాలావధికి మరియు తదుపరి అపరాధమునకు శాశ్వతముగా మండలి యొక్క రిజిస్టరు నుండి అతని పేరును తొలగించుటకు, అతని పేరును రాజ్య వైద్య మండలికి నివేదించవలెను.

1. ఉప-పరిచ్ఛేదములు (2), (3) మరియు (4)లు 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

(3) 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచబడినవి కాక, ఇతర ప్రయోజనముల నిమిత్తము ఎవరేని గర్భిణీ స్త్రీపై ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ లేక లింగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల కొరకు ఏదేని జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాల లేదా అల్ట్రాసౌండు క్లినిక్ లేదా ప్రతిబింబము (ఇమేజింగు) క్లినిక్ లేదా జన్యుసంబంధ చికిత్స వైద్యుడు, స్త్రీజననేంద్రియ చికిత్స వైద్యుడు, ధ్వనిసంబంధ చికిత్స (సోనోలజిస్టు) వైద్యుడు లేదా ప్రతిబింబ (ఇమేజింగు) నిపుణుని లేదా రిజిస్ట్రీకృత వైద్యవృత్తిదారుని లేదా ఎవరేని ఇతర వ్యక్తి యొక్క సహాయమును అర్థించు ఎవరేని వ్యక్తి మొదటి అపరాధమునకు మూడు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారాగారవాసముతోను మరియు యాభై వేల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను మరియు ఏదేని తదుపరి అపరాధమునకు ఐదు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారాగారవాసముతోను మరియు ఒకలక్ష రూపాయల వరకు ఉండగల జరిమానాతోను శిక్షించబడవలెను.

(4) సందేహముల నివృత్తి కొరకు, అట్టి బలవంతపు రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలు లేదా లింగనిర్ధారణ అవసరమున్నట్టి మహిళకు ఉప-పరిచ్ఛేదము (3) యొక్క నిబంధనలు వర్తించరాదని ఇందుమూలముగా నిబంధించబడినది.]

ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల నిర్వహణ విషయములో పురోభావన.

[1][24. భారత సాక్ష్య చట్టము, 1872 (1872లోని 1వది)లో ఏమిఉన్నప్పటికిని, అది విరుద్ధమని నిరూపించబడిననే తప్ప 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచ బడినవి కాక ఇతరమైన ప్రయోజనముల కొరకు గర్భిణీ స్త్రీ తన భర్తచే లేదా సందర్భాను సారము ఎవరేని ఇతర బంధువుచే ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియలను చేయించుకొనవలసినదిగా బలవంతము చేసినట్లుగా న్యాయస్థానము భావించును మరియు అట్టి వ్యక్తి 23వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద దుష్ప్రేరణను చేసినట్లుగా భావించబడి, ఆ పరిచ్ఛేదము క్రింద నిర్దిష్టపరచబడిన అపరాధము కొరకు శిక్షింపదగి ఉండును.]

నిశ్చితమైన శిక్ష నిబంధించబడని ఈ చట్టపు నిబంధనలు లేదా నియమముల ఉల్లంఘనలకు పెనాల్టీ.

25. ఈ చట్టములో ఎక్కడైననూ ఎట్టి పెనాల్టీ గురించి నిబంధించనపుడు, ఈ చట్టము యొక్క నిబంధనలు లేదా దానిక్రింద చేయబడిన నియమములను ఉల్లంఘించిన వారెవరైనను, మూడు నెలల వరకు విస్తరించగల కాలావధికి కారాగారవాసముతోను లేదా ఒక వేయి రూపాయల వరకు ఉండగల జరిమానాతో లేదా రెండింటితోను మరియు దోషస్థాపన తరువాత కొనసాగుతున్న ఉల్లంఘన విషయములో అట్టి ఉల్లంఘన కొనసాగునంత వరకు ప్రతి దినమునకు ఐదువందల రూపాయల వరకు ఉండగల అదనపు జరిమానాతోను శిక్షింపదగి ఉండును.

1. 24వ పరిచ్ఛేదము 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

కంపెనీలచే అపరాధములు.

26.(1) ఈ చట్టము క్రింద శిక్షింపబడదగు ఏదేని అపరాధమును ఒక కంపెనీ చేసి ఉండినయెడల, అపరాధము జరిగిన సమయములో కంపెనీ యొక్క వ్యాపార వ్యవహారముల నిర్వహణకు ఇన్‌ఛార్జిగా ఉండి మరియు దాని బాధ్యత వహించిన ప్రతివ్యక్తియు మరియు కంపెనీయు ఆ అపరాధమునకు దోషులుగా భావించవలెను మరియు తదనుసారముగా చర్య తీసుకొనబడి మరియు శిక్షింపబడుటకు పాత్రుడుగాను;

అయితే, ఆ అపరాధము తనకు తెలియకుండా జరిగినదని లేదా దానిని నివారించుటకు తాను తగిన జాగ్రత్తను తీసుకొనినట్లుగా నిరూపించుకొనిన యెడల, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద ఉన్నదేదియు సదరు వ్యక్తిని ఏ శిక్షకును గురిచేయదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, ఈ చట్టము క్రింద శిక్షింపబడదగు అపరాధమును ఒక కంపెనీ చేసియుండి, మరియు అపరాధము ఆ కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేదా ఇతర అధికారి యొక్క సమ్మతితో లేదా మౌనానుకూలతతో జరిగినదని లేదా అతనికి ఆపాదించదగు ఏదేని నిర్లక్ష్యముతో జరిగినదని నిరూపించబడిన యెడల, అట్టి డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేదా ఇతర అధికారి ఆ అపరాధము చేసినట్లు దోషిగా భావించవలెను మరియు తదనుసారముగా చర్యలు జరుపబడి మరియు శిక్షింపబడుటకు పాత్రుడగును.

<u>విశదీకరణ</u>:- ఈ పరిచ్ఛేదపు నిమిత్తము,-

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమ నికాయము అని అర్థము మరియు దానిలో ఫర్మ్, లేదా ఇతర వ్యక్తుల అసోసియేషను చేరియుండును; మరియు

(బి) ఫర్మ్‌కు సంబంధించి "డైరెక్టరు" అనగా ఫర్మ్‌లోని భాగస్వామి అని అర్థము.

అపరాధము సంజ్ఞేయమైనదై, జామీను యోగ్యము కానిదై మరియు రాజీకి యోగ్యము కానిదై ఉండుట.

27. ఈ చట్టము క్రింది ప్రతి అపరాధము సంజ్ఞేయమైనదై ఉండి, జామీను యోగ్యము కానిదై మరియు రాజీకి యోగ్యము కానిదై ఉండవలెను.

అపరాధముల సంజ్ఞేయము.

28.(1) ఈ క్రిందివారిచే చేయబడిన ఫిర్యాదులపై తప్ప, ఈ చట్టము క్రింది అపరాధమును ఏ న్యాయస్థానము సంజ్ఞేయము చేయరాదు,-

(ఎ) సంబంధిత సముచిత ప్రాధికార సంస్థ లేదా కేంద్ర ప్రభుత్వముచే లేదా సందర్భానుసారముగా ఏదేని రాజ్య ప్రభుత్వముచే లేదా సముచిత ప్రాధికార సంస్థచే ప్రాధికారమీయబడిన ఎవరేని ప్రాధికారి; లేదా

(బి) విహితపరచబడినట్టి రీతిలో, న్యాయస్థానమునకు ఫిర్యాదుచేయు తన ఉద్దేశమును గురించి, మోపబడిన అపరాధమును గురించి సముచిత ప్రాధికార సంస్థకు [1][పదిహేను దినములకు] తక్కువ కానట్టి నోటీసును ఇచ్చిన వ్యక్తి.

---

1. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి "ముప్పది దినములు" అను పదములు ఉంచబడినవి.

విశదీకరణ:- ఈ ఖండపు ప్రయోజనముల నిమిత్తము "వ్యక్తి" అనుపదములో సామాజిక వ్యవస్థ చేరి ఉండును.

(2) ఈ చట్టము క్రింద శిక్షింపదగిన ఏదేని అపరాధమును మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు లేదా మొదటి తరగతి జుడీషియల్ మేజిస్ట్రేటు కానటువంటి ఏ ఇతర న్యాయ స్థానము విచారణ జరుపరాదు.

(3) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (బి) క్రింద ఫిర్యాదు చేయబడిన యెడల, న్యాయస్థానము, అట్టి వ్యక్తి అభ్యర్థనపై తన స్వాధీనములో ఉన్న సంబంధిత రికార్డుల యొక్క ప్రతులను అట్టి వ్యక్తికి అందజేయవలసినదని సముచిత ప్రాధికార సంస్థను ఆదేశించవచ్చును.

## అధ్యాయము - 8
## వివిధములు

రికార్డుల నిర్వహణ.

29.(1) ఈ చట్టము మరియు నియమముల క్రింద నిర్వహించబడు అన్ని రికార్డులు ఛార్టులు, ప్రరూపములు, రిపోర్టులు, సమ్మతి లేఖలు మరియు అన్ని ఇతర దస్తావేజులు రెండు సంవత్సరముల కాలావధిపాటు లేదా విహితపరచబడునట్టి కాలావధిపాటు భద్రపరచవలెను:

అయితే, ఏదేని జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలపై ఏవేని క్రిమినలు లేదా ఇతర (శాసనిక) ప్రొసీడింగులు సంస్థితము చేయబడినపుడు అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాల యొక్క రికార్డులు మరియు ఇతర దస్తావేజులన్నీ అట్టి (శాసనిక) ప్రొసీడింగుల తుది పరిష్కారము జరుగునంత వరకు భద్రపరచవలెను.

(2) అట్టి రికార్డులన్నింటిని, అన్ని సమయములందును తనిఖీ చేయుట కొరకు సముచిత ప్రాధికార సంస్థకు లేదా ఈ విషయములో సముచిత ప్రాధికార సంస్థచే ప్రాధికార మీయబడిన ఎవరేని ఇతర వ్యక్తికి అందుబాటులో ఉంచవలెను.

రికార్డులను సోదాచేసి మరియు వాటిని జప్తు చేయుటకు అధికారము మొదలగునవి.

[1][30.(1) ఈ చట్టము క్రింది ఒక అపరాధము, ఏదేని జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యుసంబంధ వైద్యశాల లేదా ఏదేని ఇతర స్థలము వద్ద జరిగినదని లేదా ఇదివరకటినుండే జరుగుచున్నదని సముచిత ప్రాధికార సంస్థ విశ్వసించుటకు తగిన కారణము ఉన్నయెడల, అట్టి ప్రాధికార సంస్థ లేదా ఈ విషయములో దానిచే ప్రాధికార మీయబడిన ఎవరేని అధికారి, విహితపరచబడునట్టి నియమములకు లోబడి, అట్టి ప్రాధికార సంస్థ లేదా అధికారి అవసరమని భావించునట్టి బలగముతో అన్ని సబబైన వేళలయందు, అట్టి కేంద్రము, ప్రయోగశాల లేదా వైద్యశాల లేదా ఇతర స్థలము

1. ఉప-పరిచ్ఛేదము (1) 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.

నందు ప్రవేశించి మరియు సోదాచేసి ఏదేని రికార్డు, రిజిస్టరు, దస్తావేజు, పుస్తకము కరపత్రము, వ్యాపార ప్రకటన లేదా ఏదేని ఇతర వాస్తవ విషయమును పరీక్షించి, అవి ఈ చట్టము క్రింద జరిగిన శిక్షించదగు అపరాధమునకు సాక్ష్యముగా ఉండగలవని అట్టి ప్రాధికార లేదా అధికారి విశ్వసించుటకు కారణమున్న యెడల దానిని అభిగ్రహణము చేయవలెను.]

(2) ఈచట్టము క్రింద చేయబడిన ప్రతి సోదా లేదా అభిగ్రహణమునకు క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 (1974లోని 2వది)లోని సోదాలు మరియు అభిగ్రహణములకు సంబంధించిన నిబంధనలు సాధ్యమైనంత వరకు వర్తించును.

సద్భావముతో తీసుకొనిన చర్యకు రక్షణ.

31. ఈ చట్టపు నిబంధనలను పురస్కరించుకొని సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనిపైనైననూ, కేంద్ర లేదా రాజ్య ప్రభుత్వము లేదా సముచిత ప్రాధికార సంస్థ లేదా కేంద్ర లేదా రాజ్య ప్రభుత్వములచే లేదా ప్రాధికార సంస్థచే ప్రాధికార మొసగబడిన ఎవరేని అధికారిపై ఎట్టి దావా, అభియోగము లేదా శాసనిక చర్య ఉండరాదు.

చిక్కుల తొలగింపు.

[1][31ఏ.(1) ప్రసవ పూర్వరోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల (క్రమబద్ధము చేయు మరియు దుర్వినియోగ నివారణ) సవరణ చట్టము, 2002 యొక్క నిబంధనలను అమలుపరచుటలో ఏదేని చిక్కు ఏర్పడినచో అట్టి చిక్కును తొలగించు నిమిత్తము, కేంద్ర ప్రభుత్వము, అధికార రాజపత్రములో ఉత్తర్వును ప్రచురించుట ద్వారా ఈ చట్టపు నిబంధనలకు అసంగతముగా లేకుండా, తాను అవసరమని లేదా ఉపయుక్తమని భావించునట్టి నిబంధనలను చేయవచ్చును:

అయితే, ప్రసవ పూర్వ రోగ నిర్ధారణ సాంకేతిక ప్రక్రియల (క్రమబద్ధముచేయు మరియు దుర్వినియోగ నివారణ) సవరణ చట్టము, 2002 ప్రారంభమైన తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధి ముగిసిన తరువాత ఈ పరిచ్ఛేదము క్రింద ఎట్టి ఉత్తర్వును చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ప్రతి ఉత్తర్వు, దానిని చేసిన వెంటనే సాధ్యమైనంత త్వరగా పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టవలెను.]

నియమములు చేయుటకు అధికారము.

32.(1) ఈ చట్టపు నిబంధనలు అమలుజరుపు నిమిత్తము కేంద్ర ప్రభుత్వము నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకముగాను మరియు పైన చెప్పబడిన అధికారము యొక్క సాధారణతకు భంగము వాటిల్లకుండా అట్టి నియమములు ఈ క్రింది వాటిని నిబంధించవలెను,-

---

1. పరిచ్ఛేదము 31-ఏ 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినది.

[1][ (i) 3వ పరిచ్ఛేదపు ఖండము (2) క్రింద రిజిస్ట్రీకృత జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలలో నియమించబడిన వ్యక్తులకైన కనీస అర్హతలు;

(iఎ) 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)నకు గల వినాయింపు క్రింద ఒకవ్యక్తి తన క్లినిక్‌లో గర్భిణిపై అల్ట్రాసోనోగ్రఫీని నిర్వహించు రీతికి సంబంధించిన రికార్డును వ్రాసి ఉంచవలెను;]

(ii) 5వ పరిచ్ఛేదము క్రింద గర్భిణీస్త్రీ నుండి పొందవలసి ఉండునట్టి సమ్మతి (పత్రము) యొక్క ప్రరూపము;

(iii) 8వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద కేంద్ర పర్యవేక్షక బోర్డు తమ కృత్యములను నిర్వర్తించుటలో అనుసరించవలసిన ప్రక్రియ;

(iv) 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (5) క్రింద పదవీ రీత్యా సభ్యులు కానట్టి ఇతర సభ్యులకు అనుమతించదగు భత్యములు;

[2][(ivఎ) 16వ పరిచ్ఛేదపు ఖండము (iv) క్రింద కేంద్ర పర్యవేక్షక బోర్డుచే చేయబడిన నిబంధల ననుసరించి జన్యు సంబంధ సలహా కేంద్రములు, జన్యు సంబంధ ప్రయోగశాలలు లేదా జన్యు సంబంధ వైద్యశాలలో పనిచేయు వ్యక్తులు పాటించవలసిన ప్రవర్తన నియమావళి;

(ivబి) చట్టము యొక్క 16-ఏ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (iv) క్రింద రాజ్యములో చేపట్టిన వివిధ కార్యక్రమాల విషయములో, రాజ్య మరియు సంఘ రాజ్య క్షేత్రము యొక్క పర్యవేక్షక బోర్డులచే బోర్డుకు మరియు కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించవలసిన రిపోర్టుల యొక్క రీతి;

(ivసి) 17ఏ పరిచ్ఛేదము యొక్క ఖండము (డి) క్రింద సముచిత ప్రాధికార సంస్థకు అధికారమిచ్చు ఏదేని ఇతర విషయము;]

(v) 17వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (8)నకు గల వినాయింపు క్రింద, సలహా కమిటీ యొక్క ఏవేని రెండు సమావేశముల మధ్య వచ్చు కాలావధి;

(vi) 17వపరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (9) క్రింద సలహా కమిటీకి ఒక వ్యక్తి నియామకమునకైన షరతులు మరియు నిబంధనలు మరియు అట్టి కమిటీ అనుసరించవలసిన ప్రక్రియ;

---

1. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి ఉంచబడినది.
2. 2003లోని 14వ చట్టము ద్వారా 14-2-2003 నుండి చొప్పించబడినవి.

(vii) 18వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రీకరణ కొరకైన దరఖాస్తు ప్రరూపము మరియు రీతి మరియు దానికి చెల్లించవలసి ఉండునట్టి ఫీజు;

(viii) 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (5) క్రింద జన్యు సంబంధ సలహా కేంద్రము, జన్యు సంబంధ ప్రయోగశాల లేదా జన్యు సంబంధ వైద్యశాలచే సమకూర్చబడు సౌకర్యములు మరియు నిర్వహించబడు సాధన సామగ్రి మరియు ఇతర ప్రమాణములు;

(ix) 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జారీచేయబడు రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము యొక్క ప్రరూపము;

(x) 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము యొక్క నవీకరణ తేదీ మరియు రీతి మరియు అట్టి నవీకరణ కొరకు చెల్లించదగు ఫీజు;

(xi) 21వ పరిచ్ఛేదము క్రింద చేయదలచిన అపీలు యొక్క రీతి;

(xii) 29వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రికార్డులు, ఛార్టులు మొదలగు వాటిని భద్రపరచవలసి ఉండు కాలావధి;

(xiii) 30వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (1) క్రింద వ్యక్తి యొక్క అభిరక్ష నుండి దస్తావేజులు, రికార్డులు, వస్తువులు మొదలైన వాటిని జప్తు చేయు రీతి మరియు వాటి జాబితాను తయారుచేసి సదరు వ్యక్తికి ఇచ్చురీతి;

(xiv) విహితపరచబడునట్టి లేదా కోరబడునట్టి ఏదేని ఇతర విషయము.

వినియమములు చేయు అధికారము.

33. బోర్డు కేంద్ర ప్రభుత్వము యొక్క పూర్వ ఆమోదముతో అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా ఈ చట్టము యొక్క నిబంధనలకు మరియు దాని క్రింద చేయబడిన నియమములకు అసంగతముగా లేనట్టి వినియమములను ఈ క్రింది వాటి కొరకు చేయవచ్చును,-

(ఎ) 9వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (1) క్రింద బోర్డు యొక్క సమావేశములు జరుగు సమయము మరియు స్థలము మరియు అట్టి సమావేశములలో లావాదేవీలు జరుపవలసి ఉండునట్టి ప్రక్రియ మరియు కోరముగా ఏర్పడవలసి ఉండునట్టి సభ్యుల సంఖ్య;

(బి) 11వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (1) క్రింద బోర్డుతో తాత్కాలికముగా ఒక వ్యక్తి సహసంబంధమును ఏర్పరచుకొను రీతి;

(సి) 12వ పరిచ్ఛేదము క్రింద బోర్డు యొక్క అధికారులు మరియు ఇతర ఉద్యోగుల యొక్క నియామకపు పద్ధతి, సేవా షరతులు, వేతనము మరియు భత్యములు;

(డి) బోర్డు యొక్క సాధారణ వ్యవహారములను సమర్ధవంతముగా నిర్వహించుట.

నియమములు మరియు వినియమములు పార్లమెంటు సమక్షమున సమర్పించబడవలసి ఉండుట.

34. ఈ చట్టము క్రింద చేయబడు ప్రతి నియమము మరియు ప్రతి వినియమమును అవి చేయబడిన తరువాత సాధ్యమైనంత వెంటనే పార్లమెంటు అధివేశనమునందున్నచో దాని యొక్క ప్రతి సదనము సమక్షమున మొత్తము ముప్పై దినముల కాలావధి పాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశనములోగాని, రెండు అనుక్రమ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. దానిని అట్లు ఉంచిన అధివేశనము గాని లేదా రెండు అనుక్రమ అధివేశనములు ముగియుటకు ముందుగాని ఆ నియమము లేదా వినియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేదా ఆ నియమము లేదా వినియమమును చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, ఆ తరువాత ఆ నియమము లేదా వినియమము అట్లు మార్పు చేయబడినట్టి రూపములో మాత్రమే అమలు కలిగి ఉండును లేదా సందర్భానుసారము రద్దగును. ఏది ఏమైనప్పటికిని, అట్టి మార్పు లేదా రద్దు సదరు నియమము లేదా వినియమము క్రింద అంతకు పూర్వము చేసిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.